సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 17 । జూన్ । 2023



ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చేరండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అగ్రహారం, తాడూరుల్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో విద్యార్థులు చేరి, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పూర్వ విద్యార్థులు కోరారు.



అభివృద్ధి పనుల పరిశీలన

ముస్తాబాద్(సిరిసిల్ల): గన్నెవారిపల్లి, పోతుగల్ గ్రామాల్లో అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం 41.0/30.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అన్ని బీసీ కులాలకు రూ.లక్ష అందించాలి



మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని రాష్ట్రంలోని అన్ని బీసీ కులాలకు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కోరారు. మండలంలోని నర్మాలలో శుక్రవారం జిల్లాస్థాయి బీసీల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 136 బీసీ కులాలు ఉన్నాయని, కేవలం 14 కులాలకే ఆర్థిక సాయం ప్రకటించడపై మిగతా కులాలు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ స్పందించాలని, దళితబంధు తరహాలో బీసీబంధు ప్రకటిస్తే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వేముల కాశాగౌడ్, శ్రీగాధ గణేశ్, యాదాగౌడ్, పర్శ శ్రీనివాస్, పిట్ల నర్సయ్య, ఓజయ్య యాదవ్, నరేశ్‌యాదవ్, ప్రవీణ్, రాజుగౌడ్, చంద్రయ్య, నర్సింలు పాల్గొన్నారు.

ఆలయాలకు స్థలం కేటాయించండి



ఎమ్మెల్యేతో కొడుముంజ గ్రామస్తులు

వేములవాడఅర్బన్: కొడుముంజలోని రేణుక ఎల్లమ్మ, మల్లికార్జునస్వామి ఆలయాల నిర్మాణాలకు స్థలం కేటాయించాలని గౌడ, కాపు సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబును కోరారు. తన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి త్వరలోనే స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పొన్నం ప్రశాంత్, వెంకటేశం, లక్ష్మీరాజం, సాయిప్రశాంత్, శ్రీనివాస్, దేవయ్య, అంజయ్య, మల్లేశం, రాజమల్లు, కడారి విష్ణు, మహేశ్ ఉన్నారు.

కొదురుపాకలో మెగా హరితోత్సవం



స్థలం పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీవో

బోయినపల్లి(చొప్పదండి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న మండలంలోని కొదురుపాక మిడ్‌మానేరు కట్ట పరిసరాల్లో మెగా హరితోత్సవం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్ తెలిపారు. కట్ట పరిసరాలను శుక్రవారం రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావుతో కలిసి పరిశీలించారు. 400 మొక్కలు నాటనున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఈఈ సంతుప్రకాశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎఫ్ఎస్ఓ అఫ్జల్ హుస్సేన్, ఎఫ్‌బీఓ అనిత, ఈజీఎస్ ఏపీవో సవిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య తదితరులు ఉన్నారు.

బతుకమ్మ చీరల తయారీ కూలి పెంచాలి



టెక్స్‌టైల్ పార్కులో మాట్లాడుతున్న పవర్‌లూమ్ వర్కర్స్ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): టెక్స్‌టైల్ పార్కులో బతుకమ్మ చీరల బ్లౌజ్ పీస్ వస్త్రం తయారీ కూలి పెంచాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్క్‌లో శుక్రవారం కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధితోపాటు మెరుగైన వేతనాలు అందించాలనే ఉద్దేశంతో బతుకమ్మ చీరల తయారీని ఇస్తుందని తెలిపారు. బ్లౌజ్ పీస్ వస్త్రానికి మీటర్‌కు రూ.4.50 కూలి చెల్లించాలని కోరారు. జెల్ల సదానందం, అక్కల శ్రీనివాస్, ఆడెపు శుభోకర్, శ్రీనివాస్, గంగారం, వేణు, ఆంజనేయులు, శ్రీకాంత్, సతీష్, కనకయ్య, అశోక్, రమేశ్, కిషన్, శంకర్ పాల్గొన్నారు.

బోరు వద్ద దీనంగా చూస్తున్న ఈ రైతు ఎక్కలదేవి మల్లేశం. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన మల్లేశంకు మూడెకరాల పొలం ఉంది. వ్యవసాయమే ఆధారం. ఏప్రిల్ 22న ఈదురుగాలులు, వడగళ్ల వానలతో మల్లేశం పొలం వద్దకు వచ్చే విద్యుత్ లైన్ దెబ్బతింది. స్తంభాలు విరిగిపోయి, ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. యాసంగి పంట పండింది. వడ్లు అమ్ముకున్నడు. కానీ ఇప్పుడు వానాకాలం తుకం పోద్దామంటే కరెంట్ లేదు. బోరు నడవడం లేదు. విద్యుత్ లైన్‌ను బాగు చేయకపోవడంతో ఈ దుస్థితి.



కరెంట్ స్టార్టర్ వద్ద నిలుచున్న ఇతను కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ఎనగందుల రామస్వామి. రామస్వామికి మూడెకరాల పొలం ఉంది. మళ్లీ ఇప్పుడు తుకం పోద్దామంటే కరెంట్ లేదు. 55 రోజులుగా కరెంట్ లేక బోరులో నీరున్నా దిక్కులు చూడాల్సి వస్తోంది. రామస్వామికి వ్యవసాయం ఒక్కటే ఆధారం. మృగశిరకార్తె సగం పాదానికి చేరింది. ఇప్పటికీ కరెంట్ రాలేదు. తుకం పోసుడు ఆలస్యమైతే.. పంట బర్కత్ ఉండదని రామస్వామి ఆందోళన చెందుతున్నాడు.



ఇది ఈ ఇద్దరు రైతుల వేదన కాదు.. బావుసాయిపేట, గోవిందరావుపల్లి, నిమ్మపల్లి, గొల్లపల్లి శివారులోని వందలాది మంది రైతుల ఆవేదన..

కరెంట్ రాదు.. కాలం కనికరించదు

- తుకం పోద్దామంటే నీళ్లు కరువు
- ఏప్రిల్‌లో గాలివాన బీభత్సం
- విరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- నాలుగు పల్లెల్లో రైతుల పరేషాన్
- 55 రోజులుగా పట్టించుకోని సెస్
- సామగ్రి లేక మరమ్మతులు కరువు



గోవిందరావుపల్లిలో ఏప్రిల్ 22న విరిగిపడిన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

స్తంభాలు, సామగ్రి పంపిస్తున్నాం



విద్యుత్‌లైన్లు దెబ్బతిన్న ఆ గ్రామాలకు స్తంభాలు, విద్యుత్ సామగ్రి పంపిస్తున్నాం. ఫీల్డ్ స్టాఫ్‌ను పంపించి రెండు, మూడు రోజుల్లో విద్యుత్ లైన్లను బాగు చేయిస్తాం. రైతులకు ఇబ్బందుల్లేకుండా కరెంట్ సరఫరాను పునరుద్ధరిస్తాం. 55 రోజులుగా రిపేరు చేయకపోవడంపై విచారణ జరిపిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– చిక్కాల రామారావు, సెస్ చైర్మన్

సిరిసిల్ల: ప్రకృతి ప్రకోపానికి రైతులు విలవిల్లాడుతున్నారు. రెండు నెలల క్రితం వచ్చిన ఈదురుగాలుల బీభత్సానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్‌స్తంభాలు విరిగిపోయాయి. రోడ్లపై పడిపోయిన చెట్లను అధికారులు తొలగించారు. విరిగిన విద్యుత్ స్తంభాలను మరమ్మతులు చేయడం లేదు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో విద్యుత్ సామగ్రి కొరతతో కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట, గోవిందరావుపల్లి, నిమ్మపల్లి, గొల్లపల్లి గ్రామాల్లోని దెబ్బతిన్న విద్యుత్‌లైన్లను పునరుద్ధరించడం లేదు. బోర్లు, బావులలో పుష్కలంగా నీరున్నా కరెంట్ లేక నీటిని పైకి తేవడం కష్టంగా మారింది. ఇదే సమయంలో మృగశిర కార్తే సగం పాదం పూర్తయినా వర్షాలు కురువకపోవడంతో రైతులు తుకాలు పోసుకోవడం లేదు.

సెస్‌కు భారీ నష్టం

జిల్లాలో ఏప్రిల్ 22న సాయంత్రం భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ప్రకృతి ప్రకోపానికి వందలాది విద్యుత్ స్తంభాలు, పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడ్డాయి. 'సెస్' సంస్థకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. క్షేత్రస్థాయిలో 55 రోజుల కిందట విద్యుత్‌లైన్లు దెబ్బతిన్నా మరమ్మతులు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సత్వర సేవలకు మారుపేరుగా ఉన్న సెస్ సంస్థ సిబ్బంది అలసత్వానికి, నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఏదైన విద్యుత్‌లైన్ దెబ్బతింటే 24 గంటల్లో బాగుచేసే యంత్రాంగం ఉన్న సెస్‌లో 55 రోజులుగా పట్టించుకోవడం లేదు.

సేవలకు గుర్తింపు

- గంభీరావుపేట పంచాయతీకి ఐఎస్‌వో సర్టిఫికెట్



ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న సర్పంచ్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీకి అరుదైన సర్టిఫికెట్ లభించింది. 'హిమ్' అనే ఇంటర్నేషనల్ సంస్థ పంచాయతీకి 'ఐఎస్ఓ' సర్టిఫికెట్ అందించింది. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌గౌడ్ చేతుల మీదుగా సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు అవార్డు అందుకున్నారు. పంచాయతీ ప్రజలకు అందిస్తున్న సేవలకు, ప్రజల భాగస్వామ్యం, మెరుగైన పాలనకు ఈ అరుదైన సర్టిఫికెట్ లభించింది.

సిరిసిల్లకు రెవెన్యూ ఇంప్రూవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్లటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో సిరిసిల్ల బల్దియా రెవెన్యూ ఇంప్రూవ్‌మెంట్ సర్వీస్ అవార్డు సాధించింది. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన వేడుకల్లో మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ అవార్డు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య అవార్డు తీసుకున్నారు.

మంచినీటి శుద్ధిని అందరికీ చూపించాలి

- నీళ్ల పండుగను విజయవంతం చేయండి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మంచినీళ్ల పండుగ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: మిషన్ భగీరథలో మంచినీళ్ల శుద్ధిని చేసే విధానాన్ని అందరికీ చూపించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న నిర్వహించే మంచినీళ్ల పండగను విజయవంతం చేయాలని కోరారు. అగ్రహారంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, ట్రీట్‌మెంట్ ప్లాంటు వద్ద కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలకు నీటి శుద్ధి విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మిషన్‌భగీరథ ఎస్ఈ రవీందర్, గ్రిడ్ ఈఈ విజయ్‌కుమార్, ఇంట్రా ఈఈ జానకి పాల్గొన్నారు.

విజయ డెయిరీ పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై విజయ డెయిరీ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, విజయ డెయిరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు గిరిజన దినోత్సవం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన దినోత్సవం నిర్వహించనున్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, కొత్త గ్రామపంచాయతీలు, గిరిజన గురుకులాలు, హైదరాబాద్‌లో బంజారా భవన్, ఆదివాసీ భవన్ నిర్మాణాలను ప్రస్తావిస్తూ.. దశాబ్ది వేడుకలను నిర్వహించనున్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీపై జిల్లాలోని తహసీల్దార్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలన్నారు. జూన్ 23న ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుందని దీని కోసం పూర్తి సమాచారంతో సిద్ధం కావాలని సూచించారు. ఇంటింటి సర్వేలు చేపట్టి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్, తహసీల్దార్లు విజయ్‌కుమార్, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు శ్రీకాంత్, రాంరెడ్డి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సెల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ముస్తాబాద్(సిరిసిల్ల): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది క్వార్టర్లను, నిందితుల సెల్లు, అదుపులో ఉన్న వాహనాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఠాణాకు వచ్చే వారిపై మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన చోరీలు, రికవరీపై ఆరా తీశారు. నమోదైన కేసుల వివరాలు, ఎంతమందికి జైలు శిక్ష పడింది అనే వివరాలు తెలుసుకున్నారు. ఠాణాదివస్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై వెంకటరమణ, హెచ్‌సీలు ఉన్నారు.

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి



పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రైవేట్ పాఠశాలల నుంచి సర్కార్ బడిలో చేరడానికి విద్యార్థులు క్యూ కడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు ఎల్లారెడ్డిపేటలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో 30 మంది కొత్తగా ప్రవేశాలు తీసుకున్నారు. ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట సత్ఫలితాలనిస్తోంది. నాలుగో తరగతిలో పరిమితికి మించి 41 మంది విద్యార్థులు చదువుతున్నారు. నూతనంగా చేరిన విద్యార్థులతో శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, హెచ్ఎం కుబేరాస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే సిరిసిల్ల ఆదర్శం



సిరిసిల్లలో మున్సిపల్ ఆధ్వర్యంలో ర్యాలీ



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేత

- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- సిరిసిల్లలో పండుగలా పట్టణ ప్రగతి దినోత్సవం

సిరిసిల్లటౌన్: అభివృద్ధి.. సంక్షేమం.. స్వచ్ఛతలో దేశంలోనే ఆదర్శంగా సిరిసిల్ల మున్సిపాలిటీ నిలుస్తోందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి దూరంగా ఉన్న సిరిసిల్ల తొమ్మిదేళ్లలో గణనీయంగా ముందుకెళ్లిందన్నారు. ఉద్యమ స్ఫూర్తితో మంత్రి కేటీఆర్ సిరిసిల్ల పట్టణాన్ని, జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపారన్నారు. మున్సిపల్ బడ్జెట్ సుమారు రూ.80కోట్లు ఉంటే అభివృద్ధి రూ.200 కోట్లకు మించిందన్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంలో మున్సిపల్ కౌన్సిల్ అన్నివార్డులను ప్రగతిపథంలో ఉంచుతుందన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడంతో మున్సిపాలిటీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ పట్టణంలో కొత్తచెరువు, పార్కులు, మినీస్టేడియం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం, ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణాలతో పట్టణం అభివృద్ధికి చిహ్నాలుగా మారాయన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఘాట్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా న ఉంచి కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా గ్రూప్ సభ్యులకు రుణాల చెక్కులు అందించారు. 'సఫాయి అన్నా..సలాం అన్నా' పేరుతో పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు అందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు పడ్డాయి!

జిల్లా	శుక్రవారం	ఇప్పటివరకు	లక్ష్యం
కరీంనగర్	రూ.210 కోట్లు	రూ.510 కోట్లు	రూ.600 కోట్లు
జగిత్యాల	రూ.250 కోట్లు	రూ.600 కోట్లు	రూ.853 కోట్లు
సిరిసిల్ల	రూ.50 కోట్లు	రూ.330 కోట్లు	రూ.511 కోట్లు
పెద్దపల్లి	రూ.190 కోట్లు	రూ.450 కోట్లు	రూ.694 కోట్లు
మొత్తం	రూ.700 కోట్లు	రూ.1890 కోట్లు	రూ.2,658 కోట్లు

- ఉమ్మడి జిల్లాకు రూ.1890 కోట్లు విడుదల
- శుక్రవారం ఒక్కరోజే రూ.700 కోట్లు
- 20వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి



ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎప్పుడెప్పుడా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్న ధాన్యం డబ్బులు ఖాతాల్లో పడ్డాయి. శుక్రవారం పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా రూ.3 వేల కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాకు రూ.700 కోట్లు ఇచ్చింది. ఈసారి అకాల వర్షాలు, వడగళ్ల వానలతో అతలాకుతలమైన రైతు దిగుబడి తగ్గి తల్లడిల్లిపోయాడు. అనంతరం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు వరుణదేవుడు ముప్పతిప్పలు పెట్టాడు. ఇవి చాలవన్నట్లుగా కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు, నిర్వాహకులు రైతులను తాలు, తేమ పేరుతో క్వింటాలుకు 9 నుంచి 11 కిలోలు తరుగు పేరిట వేధించారు.

ఇప్పటివరకు రూ.1890 కోట్లు...

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుంచి పౌరసరఫరాలశాఖ కొనుగోలు ప్రక్రియను చేపట్టింది. మధ్యలో అకాల వర్షాలు, వడగండ్లు ఇబ్బంది పెట్టినా.. రైతులకు సమయానికి డబ్బులు ఇవ్వాలన్న లక్ష్యంతో ఎప్పటికప్పుడు ఖాతాల్లో డబ్బులు జమచేసింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు రూ.1890 కోట్లు విడుదల చేసింది. కరీంనగర్‌లో 59,186 మంది రైతుల వద్ద మూడులక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రూ.510 కోట్లు చెల్లించింది. జగిత్యాలలో 60,000 మంది నుంచి 41.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.600 కోట్లు ఇచ్చింది. సిరిసిల్లలో 2.45 లక్షల మంది నుంచి 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంకొని రూ.330 కోట్లు జమ చేసింది. పెద్దపల్లి జిల్లాలో 47,584 మంది రైతుల వద్ద 3.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.450 కోట్లు రైతులకు అందజేసింది. ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ కొనసాగుతున్నప్పటి నుంచే వరి సాగులో మేటిగా ఉండేది. తెలంగాణ వచ్చాక సాగు విస్తీర్ణం, ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో తన రికార్డులను తానే తిరగరాస్తోంది.

ఆదివారంతో కొనుగోళ్లు ముగుస్తాయి



రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ ప్రక్రియ ఆదివారానికి పూర్తవుతుంది. ఆదివారంతో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిచేసి, 20వ తేదీనాటికి డబ్బులు రైతుల ఖాతాల్లో వేసేలా చర్యలు చేపట్టాం. సీఎం ప్రవేశపెట్టిన 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుల వద్ద చెంతనే కొనుగోలు కేంద్రాలు వంటి రైతు అనుకూల విధానాలతో రాష్ట్రంలో దిగుబడి గణనీయంగా పెరిగింది.

– గంగుల కమలాకర్, పౌరసరఫరాల మంత్రి

కాళేశ్వరంతో పెరిగిన దిగుబడి



రాష్ట్రంలో వరి కొనుగోలు ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. రెండు రోజుల్లో మొత్తం కొనుగోళ్లు, డబ్బుల జమ ప్రక్రియ కూడా ముగుస్తుంది. సీఎం రైతు పక్షపాతి. కాళేశ్వరం జలాలతోనే రాష్ట్రంలో పంట దిగుబడి అనూహ్యంగా పెరిగింది. ఎంత పంట వచ్చినా కొనుగోలుకు వెనకాడవద్దని సీఎం చెప్పారు.

– సర్దార్ రవీందర్‌సింగ్, చైర్మన్, పౌరసరఫరాల శాఖ

క్లుప్తంగా

ఇసుక అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్



సిరిసిల్లక్రైం: ఇసుక అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. జిల్లాలో తరుచూ ఇసుక రవాణా చేసిన పది వాహనాలను గుర్తించి సిరిసిల్ల అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైనింగ్‌కు అప్పజెప్పగా ఆరు వాహనాలను జప్తు చేసినట్లు తెలిపారు. రెండుకంటే ఎక్కువ సార్లు వాహనాలు పట్టుబడితే జప్తుకోసం మైనింగ్‌కు అప్పగిస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ముస్తాబాద్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. కరీంనగర్ ఎల్ఎండీ నుంచి నామాపూర్‌కు వెళ్తున్న ఇసుక లారీని మండలకేంద్రంలో పట్టుకున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో లారీని ఠాణాకు తరలించామన్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫోన్ అప్పగింత



ఆచారికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ప్రేమ్‌దీప్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన శీతల ఆచారి తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు గతనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్) ద్వారా గుర్తించారు. సెల్‌ఫోన్‌ను ఎస్సై ప్రేమ్‌దీప్ ఆచారికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

వేములవాడ రూరల్ : వేములవాడ మండలంలోని హన్మాజీపేటకు చెందిన సందెల ప్రసాద్ (32) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపారు. ప్రసాద్ గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి, అక్కడినుంచి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతోనే ప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

కండక్టర్‌కు గాయాలు



ఇల్లంతకుంట: రోడ్డు ప్రమాదంలో కండక్టర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గాలిపల్లిలో ముత్యాల ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరుకానుండగా సాయంత్రం జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు తన కారులో అక్కడికి వెళ్లారు. గ్రామానికి చెందిన లింగంపెల్లి దుర్గయ్య (55) ద్విచక్రవాహనంపై వస్తూ నిలిపి ఉంచిన కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దుర్గయ్యకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వ్యవసాయ కోర్సులకు నోటిఫికేషన్

- జూలై 15 వరకు గడువు



పాలాసలోని వ్యవసాయ కళాశాల

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోని వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, హార్టికల్చర్ వంటి కోర్సుల్లో చేరేందుకు అవసరమైన నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసింది. బైపీసీ ఉత్తీర్ణులై, తెలంగాణ ఎంసెట్–2023(మెడికల్ అండ్ అగ్రికల్చర్)లో సాధించిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. వెటర్నరీ సైన్స్ కోర్సు వ్యవధి ఐదున్నర ఏళ్లు కాగా, మిగతా కోర్సుల వ్యవధి నాలుగేళ్లు.

సీట్ల వివరాలు..

- హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లా పొలాస, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, వరంగల్ అర్బన్ జిల్లా, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏడు అగ్రికల్చర్ కళాశాలలు ఉన్నాయి.
- ఇందులో 520 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 200 సెల్ఫ్ ఫైనాన్స్(పేమెంట్) సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- బీఎస్సీ(వెటర్నరీ) కళాశాలలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, వరంగల్ అర్బన్ జిల్లా మామునూరులో ఉన్నాయి. వీటిలో 174 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- **బీఎఫ్ఎస్సీ(ఫిషరీష్) కళాశాలలు** : వనపర్తి జిల్లా పెబ్బేరులో 28 సీట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ముత్తుకూర్‌లో తెలంగాణ విద్యార్థులకు 11 సీట్లు కేటాయించారు.
- **బీఎస్సీ(హార్టికల్చర్) కళాశాలలు** : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, వనపర్తి జిల్లా మోజర్లలో ఉండగా, ఇందులో 170 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 34 పేమెంట్ సీట్లను కేటాయించారు.
- **బీఎస్సీ(కమ్యూనిటీ సైన్స్) కళాశాల:** హైదరాబాద్‌లోని సైఫాబాద్‌లో ఉండగా, 38 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా 5 పేమెంట్ సీట్లు ఉన్నాయి. అన్ని కోర్సుల్లో పేమెంట్ సీట్లను ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా బర్తీ చేస్తారు.

అర్హతలివే..

- 2023 డిసెంబర్ 31 నాటికి జనరల్ అభ్యర్థులు వయస్సు 17 ఏళ్లు పూర్తయి, 22 ఏళ్లు దాటి ఉండకూడదు.
- ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు, పీహెచ్‌లకు 27 ఏళ్ల వరకు అనుమతి ఉంటుంది.
- ఒక వెటర్నరీ కోర్సుకు జనరల్ అభ్యర్థులు 17–25 ఏళ్ల మధ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు 30 ఏళ్ల వరకు ఉండవచ్చు.
- ఎకరం వ్యవసాయ భూమి ఉన్న రైతుల పిల్లలకు వెటర్నరీ కళాశాలల్లో 25 శాతం, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- అయితే, ఆ భూమి విద్యార్థి పేరిట లేదా తల్లితండ్రుల పేరిట పట్టా ఉండాలి.
- ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్ల పాటు నాన్ మున్సిపల్ ఏరియా(గ్రామీణ ప్రాంతం)లో చదివి ఉండాలి.
- బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు.
- పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీజేటీఎస్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను లాగిన్ కావాలి.

జూలై 15 వరకు గడువు..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫీజు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1,800, ఎస్సీ, ఎస్టీలు రూ.900 చెల్లించాలి. సీటు లభిస్తే.. వ్యవసాయ, కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు రూ.45,550, వెటర్నరీ కోర్సులకు రూ.57,500, ఫిషరీష్ కోర్సులకు రూ.43,740, హార్టికల్చర్ కోర్సులకు రూ.50,425 ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అగ్రికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.10 లక్షలు, హార్టికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.9 లక్షలు చెల్లించాలి. ఎంసెట్–2023 ర్యాంకుల ఆధారంగా సీట్లు బర్తీ చేస్తారు. దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు జూలై 15వ తేదీ వరకు గడువు ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దఖాలు చేసేందుకు జూలై 17వ తేదీ వరకు గడువు విధించారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు



వేములవాడ : పండుగలు సంతోషాన్నిస్తాయని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేములవాడలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాలు, పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా శుక్రవారం హాజరయ్యారు. అమ్మవారికి చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు గూడూరి లక్ష్మి, అన్నారం ఉమారాణి, సెస్ డైరెక్టర్ నామాల ఉమ, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే రమేశ్‌బాబు జెండావిష్కరణ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేష్ పాల్గొన్నారు. పట్టణంలోని పెద్దమ్మ తల్లిని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిల్లి మధు, ఇతర నాయకులు ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. నాయకులు సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేశ్, కొలకాని రాజు, వస్తాద్ కృష్ణ, పులి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మూడు ఆలయాల్లో దొంగతనం



సీసీ కెమెరాల సామగ్రిని ఎత్తుకెళ్లిన దొంగలు

కోనరావుపేట: మండలంలో ఎగ్లాస్‌పూర్, కోనరావుపేట, నిజామాబాద్‌లోని ఆలయాల్లో శుక్రవారం చోరీ జరిగింది. నిజామాబాద్ శివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన కేబుళ్లను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టారు. ఆలయంలోని అమ్మవారి బంగారు కండ్లు, గంటలు, సీసీ కెమెరాల సామగ్రిని ఎత్తుకెళ్లారు. హుండీలోని డబ్బులను తీసుకొని పెద్ద గుట్ట సమీపంలో పడేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సేనర్ల శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో, ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ ఆలయాల్లోనూ దొంగలు గంటలు ఎత్తుకెళ్లారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఒకే రోజు మూడు గ్రామాల్లోని ఆలయాల్లో దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

'డబ్బాను ధ్వంసం చేయలేదు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు జరుగుతుండగా, దారికి అడ్డంగా ఉన్న డబ్బాను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తొలగించారని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో వికలాంగురాలు సాన లలిత సోదరుడు సాన యాదగిరితో కలిసి శుక్రవారం మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న డబ్బాను వేరేచోటుకు మార్చాలని పలుసార్లు లలితకు చెప్పినట్లు తెలిపారు. చివరకు అక్కడినుంచి తొలగించే ప్రయత్నం చేయగా విరిగిపోయిందని, దీనిపై బీజేపీ నాయకులు ఆగయ్యపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. నాయకులు మీసం రాజం, మేగి నర్సయ్య, రమేశ్, బాలాగౌడ్, సుధాకర్ రావు, కాంతారావు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు అధికారులను నియమించాలి

- హైకోర్టు జడ్జీలకు న్యాయవాదుల వినతి



పోర్టు పోలియో జడ్జి శ్రావణ్‌కు విన్నవిస్తున్న సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్

సిరిసిల్లటౌన్: జిల్లా కోర్టు అధికారులను నియమించాలని కోరుతూ సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్ కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో పోర్టు పోలియో జడ్జి ఎస్.శ్రావణ్‌కుమార్, హైకోర్టు జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులను కలిసి వినతిపత్రాలు అందించి మాట్లాడారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సజ్జనం అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు వరద మారుతి, గోవర్ధన్‌రెడ్డి, గుడ్ల కిషన్, ఆకునూరి సురేష్‌ప్రసాద్, సాయిరాం, విక్రమ్ పాల్గొన్నారు. అనంతరం అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్లటౌన్: అర్హులకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. ఈమేరకు శుక్రవారం సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్ ముందు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి మాట్లాడారు. దశాబ్ద కాలంగా రేషన్‌కార్డులు రాక, పేర్ల నమోదు, తొలగింపులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్ది ఉత్సవాలపై ఉన్న పట్టింపు పేదల సమస్యలపై ప్రభుత్వానికి లేదన్నారు. శ్రీరాం సదానందం, కోడం రమణ, ఎగమటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, గోవిందు లక్ష్మణ్, సురేష్, మునీందర్, పోచమల్లు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో వేములవాడ యువకుడి మృతి

- నేడు స్వగ్రామానికి మృతదేహం



దూలం రఘు (ఫైల్)

వేములవాడఅర్బన్: బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వేములవాడలో విషాదం నెలకొంది. పట్టణంలోని సుభాష్‌నగర్ చెందిన దూలం రఘు (28) ఏడేళ్లుగా కువైట్‌లో పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఈనెల 9న విధులకు వెళ్తుండగా రోడ్డు దాటుతున్న క్రమంలో వాహనం ఢీకొని మృతిచెందినట్లు తెలిపారు. శనివారం మృతదేహాన్ని వేములవాడకు తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మైనర్ అమ్మాయి.. మేజర్ అబ్బాయి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో ఓ మైనర్ అమ్మాయి ప్రేమ వివాహం చేసుకొని శుక్రవారం ఆ జంట పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అమ్మాయికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. వీరిద్దరు కొంతకాలంగా ప్రేమించుకుంటుండగా పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో వారు ఆలయంలో పెళ్లి చేసుకొని రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించారు. అమ్మాయి మైనర్ కావడంతో చట్టప్రకారం పెళ్లి చెల్లదని, ఆమె బంధువులను పిలిపించి కౌన్సిలింగ్ చేసి అమ్మాయిని వారికి అప్పగించారు.

సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



పాఠశాలలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని నిర్మాణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ తొలగించారని, వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పాఠశాలలో మాట్లాడుతూ.. రూ.8 కోట్లతో నిర్మిస్తున్న నూతన అధునాతన భవనంలో విగ్రహాన్ని కూల్చివేసిన వారే ఏర్పాటు చేయాలన్నారు. ఎనిమిదేళ్ల క్రితం తామంతా విరాళాలు పోగుచేసి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 20న నూతన భవనాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించేందుకు వస్తున్నారని, ఆలోగా పాఠశాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేయకుంటే ప్రారంభాన్ని అడ్డుకుంటామన్నారు. పూర్వ విద్యార్థులు సందుపట్ల లక్ష్మారెడ్డి, గుండాడి వెంకట్‌రెడ్డి, నేవూరి శ్రీనివాస్ రెడ్డి, బందారపు లక్ష్మారెడ్డి, మిరియాల్‌కర్ రవి, వంగ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు సరే... రైతుల డబ్బులేవి ?

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): ఓ వైపు రైతులను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ మరోవైపు సంబరాలు చేసుకోవడం దారుణమని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. కోనరావుపేటలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతు దినోత్సవం చేసుకునే హక్కు అధికారపార్టీకి లేదన్నారు. రైతులు పండించిన కొనడంలో విఫలమయ్యారన్నారు. 40 కిలోల బస్తాకు 4 కిలోల వరకు అధికంగా తూకం వేసి రైతులను ముంచారన్నారు. ధాన్యం అమ్మి నెల రోజులు దాటినా డబ్బులు జమకావడం లేదన్నారు. మండలంలో ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టించలేదని విమర్శించారు. జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, మండల నాయకులు రాస రవీందర్‌రెడ్డి, శోభన్, గడిపెల్లి ఎల్లయ్య, లింబయ్య, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

- 150 గ్రాముల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

సిరిసిల్లక్రైం: ఇల్లంతకుంట మండలం అనంతారంలోని ఓ పాడుబడిన ఇంటిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. సిరిసిల్ల సర్కిల్ ఆఫీస్‌లో శుక్రవారం అరెస్ట్ వివరాలను వెల్లడించారు. ఇల్లంతకుంట మండలం అనంతారంలోని ఒక పాడుబడ్డ ఇంట్లో జగిత్యాల జిల్లా ప్రకాశం రోడ్డులో నివసించే గజ్జెల మోక్షిత్, కోనరావుపేట మండలం కొలనూరుకు చెందిన బిట్ల పవన్, ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌కు చెందిన కర్రేవుల వంశీ గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేశారు. వారు గంజాయి తాగుతున్నారనే సమాచారంతో ఇల్లంతకుంట ఎస్సై రాకేశ్ తన సిబ్బందితో కలసి గురువారం ముగ్గురిని పట్టుకున్నారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో శుక్రవారం హాజరుపరచగా రిమాండ్ చేశారు.

బీసీలకు ఆర్థికసాయం కాలపరిమితిని పొడిగించాలి

- విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

సిరిసిల్లటౌన్: బీసీ కుల వృత్తులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష సాయం కాల పరిమితిని పొడిగించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు చందనగిరి గోపాల్ కోరారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సాయానికి వయోపరిమితి 50 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు పెంచాలని, దరఖాస్తు కాలపరిమితిని మరో నెలరోజుల పాటు పొడిగించాలన్నారు. విశ్వకర్మల సంక్షేమానికి రూ.2వేల కోట్లు కేటాయించడంతో పాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సెక్రటరీ సనుగుల సత్యం, స్తంభంపల్లి రామచంద్రం, సుంకోజు రమేశ్, ఆంజనేయులు, కొలనూరు వేణుగోపాల్, శ్రీనివాస్, రవీందర్, వేణు, శంకర్, తదితరులున్నారు.

శుభ్రతే ఆమె లక్ష్యం..

- నిరంతర శ్రమజీవికి గుర్తింపు
- బొప్పాపూర్ పారిశుధ్య కార్మికురాలికి రాష్ట్రస్థాయి అవార్డు
- పండుగ భారతికి పలువురి అభినందనలు



అవార్డు అందుకున్న భారతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పని ఏదైనా విధుల్లో అంకిత భావం.. ఓ సామాన్య పంచాయతీ కార్మికురాలికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చింది. ఇంటిని శుభ్రం చేసుకోవడమే కష్టంగా భావిస్తున్న ఈ రోజుల్లో ఊరిని అంకిత భావంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఊరిని శుభ్రం చేయడమే ఆమెకు తెలిసిన పని. కరోనా కష్టకాలం నుంచి ఇప్పటి వరకు రోజూ పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వర్తిస్తూ గ్రామంలో అందరి మన్ననలు పొందుతోంది. ఆమె నిరంతర శ్రమను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డుతో సత్కరించి సన్మానించింది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ‘పల్లె ప్రగతి’ కార్యక్రమంలో మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన పారిశుధ్య కార్మికురాలు పండుగ భారతి గురువారం రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంది. గ్రామంలో పారిశుధ్య కార్మికురాలిగా ఆమె చేస్తున్న సేవలను జిల్లా, మండల స్థాయి అధికారులు గుర్తించి కార్మికురాలి పేరును ఉత్తమంగా గుర్తించాలని కోరగా, అందుకు ప్రతిఫలం లభించింది. జిల్లాలో ఇద్దరికి అవార్డులు రాగా అందులో రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన భారతి ఉన్నారు. అవార్డు అందుకున్న మరుసటి రోజే తిరిగి విధుల్లో చేరి పనులు చేయడం ఆమె అంకిత భావానికి నిదర్శనం. ఈ సందర్భంగా భారతికి జిల్లా అధికారులతో పాటు ఎంపీడీవో చిరంజీవి, సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి, పంచాయతీ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.





ఆరోగ్య‘యోగ’ం

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. జూన్ 21న అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా శిక్షణ ఇస్తున్నారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి, రాజన్న సిరిసిల్ల జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణను ఏర్పాటు చేశారు. యోగా శిక్షకుడు ఎలిగేటి కృష్ణ, నిర్వాహకులు పత్తిపాక సురేష్, చిలుక వేణు, నాగుల కనకయ్య, చిటికెన శ్రీనివాస్, కూరపాటి శ్రీధర్, ఆడెపు వేణు తదితరులు పాల్గొన్నారు.